ప్రజాశక్తి
బుధవారం 13 సెప్టెంబర్ 2023 | 5 | అనంతపురం

అనంతపురం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సిఐటియు నాయకులు

చెరువులు ఖాళీ..!

- మూడొంతులు నీళ్లు లేవు..
- మూడు చెరువుల్లోనే నిండుగా..
- తగ్గుతున్న నీటి నిలువ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడొంతులు ఖాళీ చెరువులు దర్శనమిస్తున్నాయి. వర్షాభావం ప్రభావంతో రోజురోజుకూ నీటి నిలువలు తగ్గిపోతున్నాయి. గతేడాది మంచి వర్షాలు రావడంతో పుష్కలంగా నీటి జాడ జిల్లాలో కనిపించింది. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి నెలకొన్న వర్షాభావంతో నీటి నిలువలు తగ్గిపోతున్నాయి. సెప్టెంబర్ మాసం ప్రారంభంలో కొంత వర్షం పడినప్పటికీ సీజన్ మొత్తంగా పడాల్సినంత వర్షపాతం నమోదవ లేదు.

4.06 టిఎంసిలే మిగులు

అనంతపురం జిల్లాలో జూన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు వర్షాల మూలంగా పడిన వర్షపాతం 58.96 టిఎంసిలు. అందులో 9.89 టిఎంసిలు నీరు భూగర్భ జలాలుగా మారింది. 6.57 టిఎంసిలు తేమ రూపంలో ఉంది. 43.6 టిఎంసిలు ఆవిరి రూపంలో పోయింది. మొత్తంగాపోనూ నాలుగు టిఎంసిల వరకే నీరు నిలువుంది.

మూడొంతుల చెరువులు ఖాళీ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1484 చెరువులున్నాయి. వీటిల్లో మూడు చెరువుల్లోనే నీరు పూర్తి స్థాయిలోనున్నాయి. 11 చెరువుల్లో 75 శాతం నీరుంది. ఇక 115 చెరువుల్లో 50 శాతం నీరుంది. 396 చెరువుల్లో 25 శాతం మాత్రమే నీరుంది. ఇక మిగిలిన 975 చెరువుల్లో చుక్కనీరు లేదు. అంటే మొత్తం చెరవుల్లో 65 శాతం ఖాళీగానే ఉన్నాయి. గతేడాది వర్షాలు పడి దాదాపు ఎక్కువ శాతం చెరువుల్లో నీరు పుష్కలంగా చేరి ఎక్కడ చూసినా జలకళ కనిపించేది. ఈ ఏడాది వర్షాభావం కారణంగా నీరు అడుగంటిపోతోంది. చెరువులు ఒక్కొక్కటిగా ఖాళీగా దర్శనమిచ్చే పరిస్థితులు నెలకొన్నాయి.

ఇప్పటికీ కొనసాగుతన్న వర్షాభావం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఇప్పటికీ వర్షాభావ పరిస్థితులే కొనసాగుతున్నాయి. సెప్టంబర్‌లో ఒక మోస్తరు వర్షం నమోదయినప్పటికీ మండలాల వారీగా చూసినా, జిల్లల వారీగా చూసినా లోటు స్పష్టంగా కనిపిస్తోంది. అనంతపురం జిల్లాలో సాధారణ వర్షపాతం 246.4 మిల్లీమీటర్లకుగానూ పడింది 185.5 మిల్లిమీటర్లు. 24.7 శాతం వర్షపాతం లోటుంది. ఇక సత్యసాయి జిల్లాలో సాధారణ వర్షపాతం 278.4 మిల్లీమీటర్లకుగానూ 182.4 మిల్లిమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 34.5 శాతం వర్షపాతలోటుంది. మండలాల వారీగా చూస్తే 31 మండలాలకుగానూ అనంతపురం జిల్లాలో 21 మండలాల్లో వర్షాభావ పరిస్థితులున్నాయి. సత్యసాయి జిల్లాలో 32 మండలాలకుగానూ 24 మండలాల్లో వర్షాభావం ఉంది. అందులో నాలుగు మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు లేకపోవడంతో వేసిన కొద్ది పాటి పంటకూడా ఎండిపోతోంది. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల వేతనాలు కాజేయడం దుర్మార్గం

- బోగస్ పేర్లతో దోచుకున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి
- శ్రీరామిరెడ్డి కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కష్టపడి పని చేసిన కార్మికులకు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ కోతలు విధించి ఆ డబ్బులు కాజేయడం దుర్మార్గం అని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మండిపడ్డారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టరేట్, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాల ఎదుట మంగళవారం ఉదయం ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నీలకంఠాపురం శ్రీరామ్‌రెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న హిందూపురం, మడకశిర డివిజన్‌లలోని కార్మికులకు 5 నెలలుగా వేతనాలు బకాయిపడ్డాయన్నారు. 14 నెలల పిఎఫ్, ఇఎస్ఐ చెల్లించకపోవడం దుర్మార్గంగా ఉందన్నారు. కాంట్రాక్టర్ కలాం నాయుడు 120 మంది కార్మికుల వేతనాల్లో మూడు సంవత్సరాల పాటు రూ.2500 వేతనాల్లో కోతలు విధించి కార్మికుల సొమ్ము కాజేశాడన్నారు. 3 సంవత్సరాలుగా 120 మంది బోగస్ కార్మికులను సృష్టించి ఒక్కొక్కరి పేరు మీద నెలకు రూ.15 వేల చొప్పున చెల్లించినట్లు తప్పుడు లెక్కలు చూపించి ప్రభుత్వం నుంచి దోచుకున్నారని తెలిపారు. ప్రభుత్వం అధికారులు విచారణ జరిపించి 19 మంది కార్మికుల పేర్లతో వేతనాలు కాజేసినట్లు తేల్చారన్నారు. వాస్తవానికి 120 మంది బోగస్ కార్మికుల పేర్లతో నెలనెలా వేతనాలు చెల్లించినట్లు చూపించి కాంట్రాక్టర్ కాజేశాడన్నారు. 120 మంది కార్మికులకు 3 సంవత్సరాల పాటు చెల్లించిన వేతనాలు లెక్కిస్తే రూ.6.48 కోట్లు అవుతుందన్నారు. అధికారులు మాత్రం 19 మంది బోగస్ కార్మికుల పేర్లతో కాజేసినట్లు తేల్చారన్నారు. వాటిపై కూడా ఇంత వరకు అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఈ అవినీతి అక్రమాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పాత్ర కూడా ఉందన్న విమర్శలు ఉన్నాయన్నారు. ఎస్ఎస్ఆర్ రేట్లతో కాకుండా కోతలు విధించి కాంట్రాక్టర్ వేతనాలు చెల్లిస్తుంటే అధికారులు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. వేతనాల్లో కోతలు విధించిన కాంట్రాక్టర్ కలాం నాయుడుపై క్రిమినల్ కేసు నమోదు చేసి ఆ డబ్బులను ఆయన నుంచి రికవరి చేసి కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇందులో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పాత్రపై కూడా విచారణ జరిపించాలన్నారు. అక్రమాలకు పాల్పడిన కాంట్రాక్టర్ కలాం నాయుడు కాంట్రాక్ట్ లైసెన్స్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలన్నారు. కార్మికుల బకాయి పడ్డ 5 నెలల వేతనాలు, 15 నెలల పిఎఫ్ చెల్లించాలన్నారు. శ్రీసత్యసాయి జిల్లా శ్రీరామ్‌రెడ్డి కార్మికులకు వేతనాలు పెంచాలన్నారు. వేతనాలు చెల్లించేప్పుడు ఇఎస్ఐ, పిఎఫ్ చెల్లించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఎమ్.గౌతమిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్‌రెడ్డి కార్మికుల యూనియన్ నాయకులు సుబ్బరాజు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.గౌతమి

వందశాతం పరిశీలన పూర్తి చేశాం

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించి జిల్లాలో వంద శాతం ఓటర్ల పున్ణపరిశీలన పూర్తి చేశామని కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి మంగళవారం ఉదయం స్పెషల్ సమ్మర్ రివిజన్ - 2024, ఇంటింటి సర్వేపై రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఎం.గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్‌ఒ గాయత్రీ దేవి, ఈఆర్‌ఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 96,153 ఓటరు తొలగింపులు అన్నింటినీ పున్ణపరిశీలన చేశామన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా దీనిని పూర్తి చేసినట్లు వివరించారు. ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా పున్ణపరిశీలన చేపట్టామన్నారు. ఇంటింటి పరిశీలనలో వచ్చిన ఫాం-6,7,8 క్లెయిమ్స్ ఈనెల 15వ తేదీ నాటికి పరిశీలన పూర్తి చేసి ఆన్లైన్లో అప్లోడ్ చేస్తామన్నారు. నూతన ఓటర్ల నమోదుకు సంబంధించి పరిశీలన కార్యక్రమం 15 రోజుల్లోగా పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ఈనెల 19వ తేదీన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు మధుసూదన్, నిశాంత్ రెడ్డి, రవీంద్ర, హెచ్ఎన్ఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఈఆర్‌ఓ వెంకటేశ్వర్లు, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ కనకరాజు పాల్గొన్నారు.

చంద్రబాబు కోసం పోరాటం

- నేటి నుంచి నిరవధిక దీక్షలు
- జగన్ కుట్రలను ప్రజలకు తెలియజేద్దాం
- ఉమ్మడి జిల్లా టిడిపి నేతలు

ఉమ్మడి అనంతపురం జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుపై అక్రమ అరెస్టును నిరసిస్తూ, ఆయన విడుదల అయ్యేంత వరకు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా నిరవధిక నిరసన కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు ఆ పార్టీ ముఖ్య నాయకులు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అనంతపురం జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని అనంతపురం బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. టిడిపి హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు బికె.పార్థసారథి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాజీ మంత్రులు పల్లె రఘునాథ్‌రెడ్డి, పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్యేలు వైకుంఠం ప్రభాకర్ చౌదరి, జితేంద్రగౌడ్, కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి కళ్యాణదుర్గం నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఉమా మహేశ్వరనాయుడు, ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, శింగనమల ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటి మడుగు కేశవరెడ్డి, హిందూపురం నియోజకవర్గం నాయకులు అంబికా లక్ష్మినారాయణ, టిడిపి అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, మాజీ మేయర్ స్వరూప, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు గౌస్‌మొద్దీన్, మాజీ జడ్పీటిసి రాంమ్మోహన్ నాయుడు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బికె.పార్థసారథి మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడుపై కక్ష సాధింపుతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు సంబంధించి ఎక్కడా రూపాయి కూడా అవినీతి జరగలేదన్నారు. కావాలనే జగన్మోహన్‌రెడ్డి చంద్రబాబును కేసులో ఇరికించాడని తెలిపారు. 16 నెలలు జైలు శిక్ష అనుభించిన జగన్‌మోహన్‌రెడ్డి కావాలనే చంద్రబాబును జైలుకు పంపాడని దుయ్యబట్టారు. న్యాయపోరాటంలో టిడిపి అధినేత మచ్చలేని చంద్రుడిగా, కడిగిన ముత్యంలా జైలు నుంచి బయటకు రావడం ఖాయం అన్నారు. ప్రభుత్వ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా మద్దతుతో జగన్‌కు గుణపాఠం నేర్పాల్సి ఉందన్నారు. బుధవారం నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో టిడిపి ఆధ్వర్యంలో నిరవధిక దీక్షలు చేపట్టనున్నట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ అధినేత అరెస్టులతో వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం రాబోయే ఎన్నికల్లో లబ్ది పొందాలనే అపోహల్లో ఉందన్నారు. వారి అనుకున్నట్లు ఏదీ జరగదన్నారు. మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అధికారంలో రాగానే హత్యా రాజకీయాలు జరిగాయని తెలిపారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో వచ్చాక ఆర్థిక వనరులను దెబ్బతీస్తూ ప్రతిపక్షాలను ఇబ్బందులు పెట్టేందుకు చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ అధినేత చంద్రబాబుకు జరిగిన ఇబ్బందులపై ప్రతి నాయకుడు, కార్యకర్త బరువెక్కి హృదయంతోనే నిరసనలు తెలియజేస్తున్నారని తెలిపారు. అధినేతను విడుదల చేసేంత వరకు ఐక్యంగా పని చేద్దామన్నారు. మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప మాట్లాడుతూ మొండిగా పరిపాలన చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో గట్టి గుణపాఠం నేర్పుదామన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ కుట్ర రాజకీయాలకు రోజులు దగ్గర పడ్డాయని తెలిపారు. మాజీ పరిటాల సునీత మాట్లాడుతూ అధినేత విడుదల చేసేంత వరకు మహిళా పోరాడుదామన్నారు.

కోర్టుల్లో సౌకర్యాలు కల్పించేలా చర్యలు

జిల్లా జడ్జి జి.శ్రీనివాస్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని కోర్టుల్లో మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు రావాలని జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ కోరారు. మంగళవారం సాయంత్రం అనంతపురం నగరం జిల్లా కోర్టు జడ్జి ఛాంబర్లో హైకోర్టు ఆదేశాల ప్రకారం పిల్లల సంరక్షణ కేంద్రాలు, కోర్టుల్లో మహిళలకు మరుగుదొడ్లు, శానిటరీ నాప్కిన్స్ ఏర్పాటు, ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక మరుగుదొడ్ల ఏర్పాటు, తదితర అంశాలపై జిల్లా జడ్జి జి.శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అనంతపురం జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, శ్రీ సత్యసాయి జిల్లా డిఆర్‌ఒ కొండయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో హైకోర్టు ఆదేశాల ప్రకారం పిల్లల సంరక్షణ కేంద్రాలు, కోర్టుల్లో మహిళలకు మరుగుదొడ్లు, శానిటరీ నాప్కిన్స్ ఏర్పాటు చేయడం, ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక మరుగుదొడ్ల ఏర్పాటు కోసం అవసరమైన ప్రతిపాదనలు పంపించేందుకు ఎన్ని నిధులు అవసరం అవుతాయన్న విషయమై 15 రోజుల్లోగా ప్రణాళిక రూపొందించాలన్నారు. కలెక్టర్ ఎం.గౌతమి మాట్లాడుతూ పిల్లల సంరక్షణ కేంద్రాలు, కోర్టుల్లో మహిళలకు మరుగుదొడ్లు తదితర ఏర్పాటు విషయమై స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు రావాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీటీ, టింబక్ట్, మాస్, రెడ్స్, ట్రాన్స్‌జెండర్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాస్

రూ.2కోట్ల అపహరణ నిందితులు అరెస్టు

ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు - నిందితుల్లో ఏఆర్ కానిస్టేబుల్

ప్రజాశక్తి-అనంతపురం

గార్లదిన్నె సమీపంలో జరిగిన రూ.2కోట్ల దారిదోపిడీ కేసును ఎట్టకేలకూ అనంతపురం రూరల్ పోలీసులు ఛేదించారు. ఈమేరకు నిందితులను అదుపులోకి తీసుకోవడంతోపాటు రూ.1,80,85,800 నగదు, 2 కార్లు, 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ఆగస్టు 22న సాయంత్రం సుమారు 5.15 గంటల సమయంలో బెంగళూరు నుంచి ఎస్‌ఆర్‌ఆర్ కన్స్ట్రక్షన్‌కు చెందిన శ్రీపతిరావు, అనుపమకుమార్, డ్రైవర్ శివతో కలిసి రూ.2కోట్ల నగదును ఇన్నోవా వాహనంలో హైదరాబాద్‌కు తీసుకెళుండగా జిల్లాలోని గార్లదిన్నె మండలం తలగాసిపల్లి క్రాస్ వద్దకు రాగానే నలుగురు దోపిడీ దొంగలు అడ్డుకున్నారు. పోలీసుల వేషధారణలో రెండు వాహనాల్లో వచ్చి కారులోని వారిని భయపెట్టి డిక్కీలోని రు.2కోట్ల నగదు బ్యాగును తమ వాహనంలోకి మార్చుకుని పరారయ్యారు. దీంతో ఎస్‌ఆర్‌ఆర్ కంపెనీకి చెందిన శ్రీపతిరావు ఫిర్యాదు మేరకు గార్లదిన్నె ఎస్ఐ సాగర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ఈకేసును ఛాలెంజింగ్‌గా తీసుకుని సెబ్ అదనపు ఎస్పీ రామకృష్ణ, అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి పర్యవేక్షణలో పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. అంతేగాకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కడప నగర శివార్లలో, సెంట్రల్ జైలు దాటిన తర్వాత కడప-తిరుపతి హైవే పక్కన వాడుకలో లేని దాబా హోటల్ వద్ద నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితులో కడప జిల్లా మల్లాయపల్లికి చెందిన కారపురెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కడప చిన్నచౌక్ మృత్యుంజయకుంటకు చెందిన వేంపల్లి సూర్యనారాయణరాజు, కడప టౌన్ ఎన్‌జిఒ కాలనీకి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ చేమర్తి సుబ్బరామరాజు, నెల్లూరు జిల్లాకు చెందిన కుంచె వెంకటేశ్వర్లు, రంగారెడ్డి జిల్లాకు చెందిన గుర్రాల విజయ్‌కుమార్, హైదరాబాద్ మాదాపూర్‌కు చెందిన చెంజీ రేవంత్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.1,80,85,800 నగదుతోపాటు 8 సెల్‌ఫోన్లు, ఒక ఇన్నోవా వాహనం, హోండా అమేజ్ వాహనం, 3 పోలీసు లాటీలు, రెండు అలీవ్ గ్రీన్ క్యాపులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన సెబ్ అదనపు ఎస్పీతోపాటు డీఎస్పీ, శింగనమల సిఐ అస్రార్‌బాషా, గార్లదిన్నె ఎస్ఐ సాగర్, నార్పల్ ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, రాప్తాడు ఎస్ఐ ఆంజనేయులు, ఎఆర్ ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, టెక్నికల్ ఎస్ఐ సుధాకర్‌యాదవ్‌తోపాటు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు

కార్యక్రమంలో మాట్లాడుతున్న మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ బిఎన్ శ్రీదేవి

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ బిఎన్ శ్రీదేవి

ప్రజాశక్తి-పుట్లూరు

బాల్య వివాహాలను నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మహిళా, శిశు సంక్షేమ శాఖ పీడీ బిఎన్ శ్రీదేవి పిలుపునిచ్చారు. కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశాల మేరకు 'బాల్య వివాహాలను ఆపుదాం-బాల్యాన్ని రక్షిద్దాం' బాల్య వివాహాలను అరికట్టే అంశంపై జిల్లా బాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో డివిజినల్ స్థాయి ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించడంలో ప్రతి ఒక్కరి బాధ్యత ముఖ్యమన్నారు. గ్రామస్థాయిలో వీఆర్వో, పంచాయతీ సెక్రటరీ, మహిళా పోలీసులు బాధ్యతాయుతంగా ఉంటూ బాల వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎవరైనా బాల్యవివాహాన్ని చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే మండల స్థాయి తహశీల్దార్, ఎంపిడిఒ, ఎంఇఒ, సిడిపిఒల దృష్టికి తీసుకొచ్చి నిలుపుదల చేయాలన్నారు. అనంతరం డాక్టర్ శ్రీదేవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బాల్య వివాహాల నిలుపుదల కొత్త జీవో 31పై కూలంకుషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒలు భారతి, షాజిదా బేగం, ఎంపిడిఒలు యోగానందరెడ్డి, వీరరాజ్, రంగారావు, రామకృష్ణ, తహశీల్దార్లు మోహన్‌కుమార్, సుమతి, మునివేలు, లక్ష్మీనాయక్, మండల విద్యాధికారులు పి.శ్రీదేవి, హెచ్.శ్రీదేవి, ఎల్‌పి.చంద్రశేఖర్, నాగరాజు, ఓబుళపతి, ప్రేమకుమార్, రామగోవిందరెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుబ్రమణ్యం, లీగల్ ఆఫీసర్ సంధ్యారాణి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ కృష్ణమాచారి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దీక్షలు

ప్రజాశక్తి-తాడిపత్రి

భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డు ద్వారా అందాల్సిన సంక్షేమ పథకాలను అందజేయాలని కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడు వెంకట్ డిమాండ్ చేశారు. మంగళవారం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు లేబర్ కార్డు ద్వారా దాదాపు నాలుగేళ్లుగా వివిధ పథకాలకు దరఖాస్తు చేసుకుంటున్నా మంజూరు చేయలేదన్నారు. అలాగే కార్మిక సంక్షేమ బోర్డు నుంచి కార్మికులకు అందాల్సిన పనిముట్లు అందజేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, పనికి గిట్టుబాటు ధరలు ప్రకటించాలని, ఇంజినీర్లు, ఇంటి యజమానులు, కార్మికులకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో బేల్దారి అసోసియేషన్ అధ్యక్షుడు గంగయ్య, కార్పెంటర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నబిరసూల్, గ్రానైట్ అండ్ ఫ్లోరింగ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎండి.రఫిక్, ఉపాధ్యక్షులు గౌస్‌బేగ్, కార్పెంటర్ అసోసియేషన్ అధ్యక్షులు శివకుమార్, ఉపాధ్యక్షులు జక్కన్న, గౌరవాధ్యక్షులు ఫక్రుద్దీన్, పెయింటర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు శ్రీనివాసులు, సెక్రటరీ జమాల్ వలి, ఎంసీ.రాజు, నందగోపాల్, వెంకటనారాయణ, తాడిపత్రి టౌన్ అసోసియేషన్ కమిటీ మెంబర్ వెంకటరాముడు, బేల్దారి, గ్రానైట్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పామిడి హాజీ, టైల్స్ వర్కర్స్ సభ్యులు షంషీర్, తదితరులు పాల్గొన్నారు.

దీక్షలు చేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

నేత్ర, అవయవ, శరీరదానానికి ముందుకు రండి

'అమ్మ ఐ ఆర్గాన్ బాడీ డొనేషన్' వ్యవస్థాపక అధ్యక్షులు ఈశ్వర లింగం

ప్రజాశక్తి-రాయదుర్గం

మరణానంతరం నేత్ర, అవయవ, శరీర దానానికి దాతలు ముందుకు రావాలని హైదరాబాద్‌కు చెందిన అమ్మ ఐ ఆర్గాన్ బాడీ డొనేషన్, ప్రమోషన్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గంజి ఈశ్వర లింగం, ప్రముఖ హేతువాది, సంస్థ సలహాదారు పెనుమత్స సుబ్బరాజు పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక రాయదుర్గం శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాయదుర్గంలోని సమైక్యాంధ్ర భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నేడు వైద్యరంగం కలుషితమైపోయిందన్నారు. ప్రస్తుతం సామాన్యుడు వైద్యం చేయించుకునే స్థితి లేదన్నారు. గతంలో వైద్యులు రోగి నాడి చూసి జబ్బు కనుగొనే వారని, నేడు ప్రతినాదికి పరీక్షల పేర పెద్ద మొత్తంలో రోగుల నుంచి దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వైద్యరంగంలో జీవన్‌దాన్ విభాగాన్ని ఏర్పాటు చేసినప్పటికీ కొంతకాలం తర్వాత సేకరించిన అవయవాలు, శరీరాలు ఎవరికి ఉపయోగపడుతున్నాయో సమాచారం అందుబాటులో లేదన్నారు. ఈరంగంలో కూడా బ్రోకర్లు తయారై కార్పొరేట్ ఆసుపత్రులు, ధనికులకు అవయవాలను అధిక ధరలకు అమ్ముకుంటున్నట్లు ఆరోపించారు. తమ సంస్థ ఇప్పటి వరకూ ప్రజలను చైతన్యపరిచి 2,500 మంది మృతుల నేత్రాలను అవసరమైన వారికి అందించినట్లు వివరించారు. అదేవిధంగా 150 మంది మృతుల శరీరాలను వైద్యశిక్ష కళాశాలలకు అందజేయించినట్లు తెలిపారు. స్కానింగ్‌లు, రక్త పరీక్షల పేర పెద్దమొత్తంలో ప్రజల నుంచి డబ్బు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. అయితే వైద్యులంతా చెడిపోలేదని, వైద్యరంగం అవినీతిమయం అయిపోయిందన్నారు. గతంలో ఉమ్మడి ఆసుపత్రుల బయట ఉండే మందుల షాపులు, ప్రయోగశాలలు, కొబ్బరి బొండం దుకాణాలు నేడు అన్ని ఆసుపత్రిలో భాగం అయ్యాయన్నారు. మరణానంతరం నేత్ర అవయవ శరీర దానానికి ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాయదుర్గం పట్టణానికి చెందిన తాయిమోహన్ దంపతులు, కెంచే లక్ష్మీనారాయణ దంపతులు తమ మరణానంతరం నేత్ర అవయవ శరీర దానానికి అంగీకరిస్తూ పత్రాలను నిర్వాహకులకు అందజేశారు. రాయదుర్గంలో త్వరలో నేత్రదాన సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు నేత్ర వైద్యులు మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక రాయదుర్గం శాఖ గౌరవాధ్యక్షులు ఆయూబ్‌ఖాన్, అధ్యక్షులు ఈరన్న, కార్యదర్శి జగదీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెంచే లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న 'అమ్మ ఐ ఆర్గాన్ బాడీ డొనేషన్' వ్యవస్థాపక అధ్యక్షులు ఈశ్వర లింగం

14 నుంచి నియోజకవర్గ స్థాయి పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-ఉరవకొండ

నియోజకవర్గస్థాయి పాఠశాలల పోటీలను ఈనెల 14, 15, 16వ తేదీల్లో ఉరవకొండ ఎస్‌కె ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎపి స్కూల్ గేమ్స్ క్రీడల్లో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాల, బాలికలకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం బాలికలకు, శుక్రవారం బాలురకు, శనివారం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొంటున్న పాఠశాలలకు సంబంధించిన మండల కోఆర్డినేటర్లు క్రీడాకారుల ఎంట్రీఫారంతో పాటు అర్హత పత్రాన్ని తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్కేప్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరప్ప, వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

రాయదుర్గం రూరల్ : పట్టణంలోని వినాయక సర్కిల్‌లో ఈనెల 19న జరగనున్న వినాయక చవితి 55వ వార్షికోత్సవం ఉత్సవాలకు నియోజకవర్గ వాల్మీకి సంక్షేమ సమితి సేవాసమితి అధ్యక్షులు బండి కిష్టప్ప దంపతులు రూ.25 వేలను మంగళవారం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కళ్యాణ్, శీన, జగన్, శ్రీనివాసులు, వేణు, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేస్తున్న బండి కిష్టప్ప దంపతులు

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

బొమ్మనహాల్ : మండలంలోని బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన బోయ గిరీష్‌బాబు (38) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు జమేదార్ హనుమంతునాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గిరీష్ మద్యానికి అలవాటు పడటంతో కుటుంబంలో తరచూ గొడవలు జరిగేవి. ఈనేపథ్యంలో సోమవారం కుటుంబ సభ్యులను బెదిరించేందుకు ఇంట్లో ఉరేసుకున్నాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు కిందకి దించి చికిత్స నిమిత్తం బళ్లారికి తరలించారు. ఈనేపథ్యంలో చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు భార్య అనుష్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా మృతునికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముదిగుబ్బ : మండల కేంద్రంలో నర్సరీ నిర్వహిస్తున్న వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన రామకృష్ణయ్య (52) కదిరి రోడ్డులో వెజిటేబుల్ నర్సరీ నిర్వహిస్తున్నాడు. ఈనేపథ్యంలో తన కూతురు పెళ్లికి, నర్సరీనిర్వహణకు దాదాపు రూ. 12 లక్షల దాకా అప్పులు చేశాడు. నర్సరీ సరిగా జరగనందున, అప్పులు ఎలా తీర్చాలోనని మదన పడుతూ ఉండేవాడు. ఈనేపథ్యంలో సోమవారం రాత్రి బజారుకు పోయి వస్తానని చెప్పి ఇంటి నుండి వెళ్లిన రామకృష్ణయ్య కదిరి రైల్వే గేట్ సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడం తో 108 వాహనంలో బత్తలపల్లి ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న రామకృష్ణయ్య మంగళవారం మృతిచెందాడు. మృతుడు ముదిగుబ్బ పోస్టాఫీసులో జిడిఎస్ పోస్ట్‌మ్యాన్‌గా కూడా పనిచేస్తుండేవాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జూదరులు అరెస్టు

పుట్లూరు : మండల పరిధిలోని కోమటికుంట్ల గ్రామం పరిసరాల్లో మంగళవారం జూదం ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. పేకాట ఆడుతున్నట్లు పక్కాగా అందిన సమాచారం మేరకు దాడి చేయగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.1,10,650 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మట్కా నిర్వాహకుడు అరెస్టు

మడకశిర రూరల్ : మడకశిర పట్టణంలోని ఆర్య పేటలో మట్కా నిర్వాహకులపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. మట్కా నిర్వాహకుడు మసాజ్ చారిని అరెస్ట్ చేసి స్టేషన్ కు తరలించారు. రూ. 11,340నగదు, మట్కా పేపర్లు స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ లోకేష్ తెలిపారు.

మహిళపై దాడి.. బంగారు అభరణాలు చోరీ

కొత్తచెరువు : కొత్తచెరువు సమీపంలోని బుక్కపట్నం చెరువు కట్టమీద గుర్తుతెలియని వ్యక్తులు మహిళపై దాడి చేసి ఆమె వద్ద ఉన్న ఆభరణాలు చోరీ చేసి ఆమెను ముళ్ల పొదల్లోకి తోసేసి వెళ్లిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు... తిరుపతికి చెందిన లక్ష్మీ అనే మహిళ కొద్ది నెలల కిందట పుట్టపర్తికి వలస వచ్చి హోటల్లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో ఈమెను ముదిగుబ్బకు చెందిన శ్రీనివాసులతో పరిచయం అయింది. సోమవారం శ్రీనివాసులు మహిళకు ఫోన్ చేసి బుక్కపట్నం చెరువు కట్ట వద్దకు రావాలని కోరాడు. దీంతో ఆమె అక్కడికి వచ్చింది. ఆసమయంలో ఆ ప్రాంతంలో ఎవరు లేనందున గుర్తు తెలియని వ్యక్తులు ఆమెపై దాడి చేసి గాయపరిచారు. ఆమె వద్ద ఉన్న బంగారు చైను, కమ్మలు, సెల్ ఫోను అపహరించారు. ఈసందర్భంగా ఈమెను ముళ్లపొదల్లో పడేసి వెళ్లారు. దీంతో ఆ మహిళ రాత్రంతా ముళ్లకంపల్లోనే అరుచుకుంటూ ఉండిపోయింది. మంగళవారం ఉదయం ఆ దారి వెంట వెళ్తున్న రైతులు ఆమె అరుపులు విని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మహిళకు ముళ్లకంపల్లో నుంచి బయటకు తీసి 108 లో ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లింగన్న తెలిపారు

పకడ్బందీగా పంట నమోదు చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-ఆత్మకూరు

ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. మంగళవారం మండలంలోని పి.యాలేరులో రైతు శివానంద పొలం సర్వే నెంబర్ 470-ఎఫ్‌లో చేపట్టిన పంట నమోదును జిల్లా వ్యవసాయ అధికారిణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఉలవలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాగా కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డు కలిగిన రైతులకు బ్యాంకుల ద్వారా పంట రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అలాగే పిఎం కిసాన్‌కు ఇకెవైసి చేయించుకోని రైతులు వెంటనే చేయించుకోవాలని కోరారు. దీంతోపాటు కొత్తగా రైతు భరోసా కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకున్న రైతులు ఈనెల 12వ తేదీలోపు చేయించుకోవాలనికోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి ఎడిఎ శైలజ, ఎఒ జి.సుచరిత, ఎఇఒ సుజిత, విఎఒ విద్య, రైతులు పాల్గొన్నారు.

పంట నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రత్యామ్నాయ విత్తన పంపిణీని వేగవంతం చేయండి

30లోపు పీఎం కిసాన్ ఇకెవైసి పూర్తి చేయాలి
5 నుంచి 10వతేదీలోపు ఆర్‌బికెల్లో జాబితా ప్రదర్శన
రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ సి.హరికిరణ్

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ సాగుకు అవసరమైన విత్తనాల పంపిణీని వేగవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి నుంచి వ్యవసాయ శాఖ పథకాలు అమలుపై వీడియో కాన్ఫరెన్స నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగు చేసిన ఖరీఫ్ పంటను ఈక్రాప్ నమోదు వేగవంతం చేయాలన్నారు. పంట నమోదుతోపాటు ఇకెవైసి ప్రక్రియను ఈనెల 30వతేదీలోపు పూర్తి చేయాలన్నారు. అలాగే అక్టోబర్ 5 నుంచి 10వ తేదీ వరకూ రైతు భరోసా కేంద్రాల్లో జాబితాను ప్రదర్శించి గ్రామ సభలు ఏర్పాటు చేయాలన్నారు. 11 నుంచి 14వ తేదీ వరకూ ఫిర్యాదులను పరిశీలించి సరిచేసి 16న ఫైనల్ జాబితా పెట్టాలని సూచించారు. అలాగే క్షేత్రస్థాయిలో సాగు చేసిన ప్రతి పంటనూ పక్కాగా నమోదు చేయాలన్నారు. అక్టోబర్ మాసంలో కిసాన్ డ్రోన్స్ పంపిణీ ఉంటుంది కాబట్టి కిసాన్ డ్రోన్స్ వాటికి పైలట్ ట్రైనింగ్ ఇచ్చేందుకు ప్రతి మండలం నుంచి తప్పనిసరిగా ఒక డ్రోన్ సిహెచ్‌సి గ్రూప్ ఏర్పాటు చేసి ఒక రైతుకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఇకపోతే ఆర్‌బికెల్లో ఎరువులు నిల్వ ఉంచి రైతులకు సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ, సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.రవి, యల్లప్ప, గురుమూర్తి, వెంకటరాముడు, లక్ష్మానాయక్, మండల వ్యవసాయ అధికారులు, జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం సాంకేతిక వ్యవసాయ అధికారులు వెంకటకుమార్, రాకేష్‌నాయక్, బాలనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు హర్షవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని తురకపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా అవినీతికి తావు లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అంతేగాకుండా అర్హులందరికీ పార్టీలు, కులమతాలకు అతీతంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఇలాగే పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందాలంటే జగనన్న ప్రభుత్వం మరోసారి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రావిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవిప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు రామ్మూర్తిరెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, తురకపల్లి శివారెడ్డి, లక్ష్మీరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, ఎంపిడిఒ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళతో మాట్లాడుతున్న
ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు హర్షవర్ధన్‌రెడ్డి

చంద్రబాబు అరెస్టులో ప్రభుత్వ కక్షసాధింపు లేదు..

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టులో ఎలాంటి ప్రభుత్వ కక్షసాధింపు లేదని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం వజ్రకరూరులో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ అవినీతి కేసులో పోలీసులు చంద్రబాబును అరెస్టు చేస్తే ఆయన కొడుకు సిఎం జగన్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్యంగా జగన్‌ను సైకో సీఎం అనడాన్ని తప్పుపట్టారు. పేదల సంక్షేమం కోసం దేశంలోనే ఏరాష్ట్రంలో లేని విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పేదలకు సిఎం చేస్తున్న మంచిని జీర్ణించుకోలేక నారా లోకేష్ నిత్యం అభాండాలు వేస్తూ.. కట్టు కథలు ప్రచారం చేస్తున్నాడని మండిపడ్డారు. అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పథకాలు అందజేస్తున్నట్లు వివరించారు. టిడిపి రాష్ట్రబంద్‌కు పిలుపునిస్తే ఆ పార్టీ నేతలే పెద్దగా పట్టించుకోవడం లేదన్నారు. ఆఖరికి చంద్రబాబు సంస్థ హెరిటేజ్ కూడా మూయలేదని ఎద్దేవా చేశారు. 14 ఏళ్లు సీఎంగా పని చేసిన వ్యక్తిని సాక్ష్యాలు లేకుండా సీఐడీ అరెస్టు చేస్తుందా.. అని ప్రశ్నించారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో అవినీతి జరిగిందన్న సాక్ష్యాలు ఉండబట్టే సీఐడీ అరెస్టు చేసిందన్నారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు ప్రసాద్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఎంపిపి దేవీబాయి, సర్పంచి మొనాలిసా, వైస్ ఎంపిపి సుశీలారాణి, పిఎసిఎస్ ఛైర్మన్ సుధీర్‌రెడ్డి, పెద్దహోతూరు సర్పంచి సురేంద్ర, ఎంపిటిసి ఫిరోజ్‌బాను, సామానాయక్, రామకృష్ణ, వైద్యనాథ్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పరమేష్, సుభాష్, గోవర్ధన్, చైతన్య, నారాయణస్వామి, అల్లప్ప, ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

నూతన పింఛన్లు తీసుకున్న వారితో మేయర్ మహమ్మద్ వసీం

అర్హతే ప్రామాణికంగా పింఛన్ల మంజూరు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నామని మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. నగరంలోని 48వ డివిజన్ పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో అర్హత ఉన్న లబ్ధిదారులకు నూతనంగా 671 పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రస్తుతం నగరంలో నూతన పింఛన్లతో కలిపి 23,652 వివిధ రకాల పింఛన్లు లబ్ధిదారులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీనివాసులు, సైపుల్లా, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-ఉరవకొండ

ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) నుంచి మంజూరైన చెక్కులను మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సంబంధిత లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. వజ్రకరూరుకు చెందిన శివప్రసాద్‌రెడ్డికి రూ.4లక్షలు, కమలపాడుకు చెందిన తిరకమ్మకు మంజూరైన రూ.35 వేల చెక్కును ఆయా లబ్ధిదారులకు అందించారు. చెక్కులు పొందిన లబ్ధిదారులు సీఎం జగన్, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న
మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

పాఠశాల స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-బెలుగుప్ప

క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతోపాటు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పలువురు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎంఇఒ మల్లారెడ్డి ప్రధానోపాధ్యాయులు, వెంకటప్రసాద్ ప్రారంభించారు. ఈ క్రీడల్లో గెలుపొందిన క్రీడాకారులు గురు, శుక్ర, శనివారాల్లో ఉరుకుందులో జరిగే నియోజకవర్గస్థాయి పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు సిద్ధన్న, రఘు, మలోబన్న, రాజశేఖర్, రాధాకృష్ణ అమర్‌తోపాటు మండలంలోని వివిధ పాఠశాల నుంచి 200 మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు.

బెలుగుప్పలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

పుట్లూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అండర్-14, 17 ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల విద్యాధికారిణి శ్రీదేవి క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు పక్కీరప్ప, మురళీ, పవన్‌కుమార్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరులో మాట్లాడుతున్న వక్తలు

ఓటమి భయంతోనే చంద్రబాబుపై కేసులు

ప్రజాశక్తి-శింగనమల

వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించిన సిఎం జగన్ టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయించారని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆరోపించారు. మంగళవారం అనంతపురంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి దండు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతోనే వైసిపి ప్రభుత్వం చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించిందన్నారు. ఇందులో భాగమే 14ఏళ్ల మచ్చలేని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అవినీతి మరకంటించాలని ఆరోపించారు. ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.ఆదినారాయణ, బోయ సుధాకర్, బండి పరశురాం, ప్రసాద్‌నాయక్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న దండు శ్రీనివాసులు

TADIPATRI MUNICIPALITY

Invitation for Expression of Interest (EOI) for Consultancy Services Roc.No.183/AMRUT 2.0/2023/E1 ,Dt:12.09.2023

Expression of Interest (E.O.I.) is invited by the undersigned from the registered companies/consultants having Registration in Govt. of A.P. and experience in similar nature of work for Preparation of Detailed Project Reports for the proposed independent Water Supply and Sewerage Improvement Scheme as source to Tadipatri Municipality duly conducting Detailed Investigation. Preparation of designs, estimates etc. complete as per department directions.

1.	Last Date for Receipt of application along with Schedule cost of Rs.2,000/-	19.09.2023 upto 05:00 PM
2.	Date of issue Schedule	20.09.2023
3.	Last Date for Receipt of Schedule (EOI)	21.09.2023 upto 02:00 PM
4.	Opening Date	21.09.2023 upto 04:00 PM

For further details contact Cell No.9849905855.

Commissioner,
Tadipatri Municipality

ద్విచక్ర వాహనాలు దగ్ధం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని అబాద్ పేటలో ఇంటి ముందు నిలబెట్టిన నాలుగు ద్విచక్ర వాహనాలకు మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. ఈ మంటల్లో ఆ నాలుగు ద్విచక్ర వాహనాలు కాలి బూడిదయ్యాయి. ఈ విషయంపై ద్విచక్ర వాహనదారుల యజమానులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

కాలి బూడిదైన ద్విచక్ర వాహనాలు

భూముల రిజిస్ట్రేషన్ పత్రాలు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-పుట్లూరు

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితులకు ఇచ్చిన భూముల రిజిస్ట్రేషన్ పత్రాలను రైతులకు ఇవ్వాలని సిపిఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ మోహన్‌కుమార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య మాట్లాడుతూ మండలంలోని అరకటవేముల గ్రామంలో భూమిలేని దళిత నిరుపేదలకు 1999లో అప్పటి ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా భూములు కొనుగోలు చేసి భూమిలేని దళిత రైతులు 61 మందికి భూ పంపిణీ చేశారన్నారు. అయితే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వం ఇచ్చిన భూములకు అప్పు రద్దు చేశారన్నారు. అయినా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు రిజిస్ట్రేషన్ పత్రాలు రైతులకు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి రైతులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు పెద్ద కొండయ్య, దేవరాజు, రైతులు వెంకటనారాయణ, బి.గుర్రప్ప, బాల లక్ష్మన్న, చిన్న కొండయ్య, శివ, గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం ఇఒఆర్‌డిగా రంగనాయకులు

రాయదుర్గం : మండల విస్తరణ అధికారి(ఇఒఆర్‌డి)గా రంగనాయకులు మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కర్నూలులో పని చేస్తున్న రంగనాయకులును పదోన్నతిపై రాయదుర్గానికి బదిలీ చేశారు. దీంతో ఆయన వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

వినాయక ప్రతిమల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-నార్పల

వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలో వినాయక ప్రతిమలను ఏర్పాటు చేయాలనుకునే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి తీసుకున్నా పోలీసుల నిబంధనల ప్రకారమే ప్రతిమలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీసుల అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడా ప్రతిమలను ఏర్పాటు చేయకూడదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.